# మూగజీవి



ఎవరో తన భుజంమీద చెయ్యివేసినట్లనిపించి తన "జన్మభూమి" నవాబ్‌పాలెం స్టేషన్‌లో, చేతిలో ఉన్న వీక్లీలో పబ్లిష్ అయిన తన కథ "మూగజీవి"ని చదువుకొంటున్న రామకృష్ణ ఉలిక్కిపడి చూశాడు తల తిప్పి.

అతను కూర్చున్న సిమెంట్ బెంచీ మీద, జాలిగా చూస్తూ చెయ్యి వేసింది ఎవరో కాదు.

ఓ పండుకోతి!

కెవ్వున అరవబోయి ఆపుకున్నాడు.

అది మరింత జాలిగా చూస్తూ మళ్ళీ చెయ్యి చాచింది.

అర్థం కాలేదు అతనికి! తెలియని కంగారు గుండెల్లో మొదలై చర్మంపై చిరుచెమటల రూపంలో ప్రత్యక్షమైంది.

అంత దగ్గరగా ఏనాడూ పండుకోతిని చూసి ఎరుగడు అతను. పండుకోతులు కోపంవస్తే పీకేస్తాయని, కరిస్తే మందేలేదని, కరవబడినవాడు పండుకోతి చేష్టలు చేసి చేసి మరణిస్తాడని బామ్మ చెబుతుండేది. అతని కంగారు చూసి అర్థం అయినదానిలా బెంచీ చివరకు వెళ్లి వెనక్కు తిరిగి రామకృష్ణ కేసి చూస్తూ యింకోసారి చెయ్యి చాచింది.

ఆకలేస్తోందేమో! తన దగ్గర ఏమీ లేవే!

తమ ఊరు పరమ పల్లెటూరు. అక్కడ పాసింజర్ ట్రైన్స్ తప్ప మరేమీ ఆగవు. పోనీ ఏ అరటిపండైనా కొని పెడదామంటే కనుచూపు మేరలో పచ్చని పొలాలు. మధ్యలో నల్లటి తారోడ్డు, మళ్లీ పచ్చని పొలాలు తప్ప ఏమీ లేవు. చుట్టూ చూసిన రామకృష్ణ పండుకోతికేసి చూశాడు.

ఊహు! అది అక్కడ లేదు. ప్లాట్‌ఫారం అనబడే ఎర్రకంకరరోడ్డుమీద కొత్తగా కట్టి, సిమెంట్ చేసిన వాటర్ టాప్ దగ్గరకు వెళ్లి ఒక్క గెంతులో పైకెక్కి టాప్‌నాబ్‌ను పట్టుకొని త్రిప్పసాగింది.

అది ప్రారంభిస్తే కదా నీరు రావడానికి!

మళ్లీ తిరిగి వచ్చి సిమెంట్ బెంచీమీద కూర్చుంది.

ఆ అదనులో లేచి వెళ్లిపోబోయిన రామకృష్ణ చటుక్కున మళ్లీ బెంచీమీద కూలబడ్డాడు.

మళ్లీ చెయ్యి చాచింది పండుకోతి.

ఏం చేస్తే బాగుంటుందబ్బా! అనుకుంటూ గుండె తడుముకుంటున్న అతనికి, చెయ్యి తగిలి జేబులోని చిల్లర గలగలమంది. వెంటనే జేబులోంచి రూపాయిబిళ్ల తీసి దాని చేతికివ్వబోయి భయపడి బెంచీమీద ఉంచాడు రామకృష్ణ.

అది వచ్చి రూపాయిబిళ్లను అటుఇటూ త్రిప్పి చూసి చెయ్యెత్తి సలామ్ పెట్టింది. అదేదో ట్రెనింగ్ అయిన పెంపుడు కోతి! తప్పించుకుని వచ్చిందన్నమాట అనుకుంటూ ఆసక్తిగా దానిచేష్టలు పరికించబోతుండగానే, దూరం నుండి వస్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ సిగ్నల్ ఇవ్వబడక కాబోలు, హఠాత్తుగా స్లో అయి మెల్లగా ఆగింది.

అంతే!

పండుకోతి ఒక్క ఉదుటున ఎదురుగా ఆగిన కంపార్ట్‌మెంట్‌లో ప్రవేశించింది. ఆడవాళ్లు భయపడినా మగవాళ్లు ధైర్యం చెప్పడంతో తమ ముందు చెయ్యిచాచిన పండుకోతికి తలా ఒక నాణెం తమకు తోచింది ఇవ్వసాగారు ప్రయాణీకులు.

చేతపడిన ప్రతీనాణెం తీసుకొని బెంచీమీద పెట్టి తిరిగి కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి మళ్లీ మళ్లీ తిరిగి రాసాగింది పండుకోతి.

రామకృష్ణకు జాలివేసింది. జేబులోంచి రుమాలు తీసి దానికి అందించాడు. అది తన పెంపుడుకోతి అనుకున్నారేమో అని మనసులో అనుకుంటుండగానే,

"దుక్కలా ఉన్నాడు! చదువుకున్న వాడిలా కనిపిస్తున్నాడు. తాను కాలుమీద కాలు వేసుకొని కూర్చుని, ఆ నోరులేని జీవం చేత ఎలా పనిచేయిస్తున్నాడో చూడు!" 'మంగతాయారు' అన్న పేరుకు తగ్గట్టుగా ఉన్న ఆవిడ ఇసుపకంఠంతో అనడంతో, వింటూనే విస్తుపోయాడు రామకృష్ణ

అయినా ఒక మూగజీవి చేస్తున్న ఆ ప్రయత్నం చూస్తున్న వారంతా తమకు తోచిన సాయం చేయసాగారు. ఒకతను కోతి చేతిలోంచి రుమాలు తీసుకొని తన ప్రక్కన ఖాళీగా ఉన్నచోట పరిచాడు. కోతి అందరినీ జాలిగా చూస్తూ, చెయ్యి చాచి తీసుకొంటున్న నాణాలు తెచ్చి రుమాలులో వేయసాగింది. చూస్తుండగానే రుమాలు ఒక నిండు ముత్తైదువ ఒక్కసారిగా అయిదారు శ్రావణమాసపు పేరంటాలకెళ్లి పుచ్చుకున్న సెనగల వాయినాల మూటలా బరువుగా తయారైంది.

దానికి కాపలా కాస్తున్న వ్యక్తి రుమాలు నాలుగు కొసలూ చేర్చి మూటకట్టాడు. కోతి తన పనిపూర్తి అయినట్టుగా మూట పక్కనే కూర్చుని చుట్టూ కలియజూసింది. దాని చూపు ఒక బుట్టలో ఉన్న వాటర్ బాటిల్‌పై పడింది.

అంతే! ఒక్క గెంతు గెంతి ఆ సీసాను తీసుకొని గుండెలకు కరిచిపట్టుకుని, ఒక చేత్తో మూటకు తీసుకొని అది రైలు దిగి మనిషిలాగా నడుచుకుంటూ సిమెంట్ బెంచీ మీదకు వచ్చింది.

మూట రామకృష్ణ చేతిలో ఉంచింది.

రామకృష్ణ మూట విప్పి బెంచీ మీద ఉన్న చిల్లర కూడా అందులో వేసి మూటకట్టాడు.

అందరి చూపు కోతివైపు, రామకృష్ణవైపు ఉన్నా ట్రైన్‌కు సిగ్నల్ క్లియర్ అవడంతో రైలు కదిలిపోయినా కనుమరుగు అయ్యేంతవరకూ చూస్తూనే ఉన్నారు.

కోతి తన చేతిలోని సీసా రామకృష్ణకి అందించింది.

దానికి దాహం వేసిందనుకుని మూత తీయబోయాడు.

బెంచీమీద ఆ చివరకు వెళ్లి అది రామకృష్ణ చేస్తున్నపని తనకి ఇష్టంలేనట్టుగా గుర్రు పెట్టింది.

రామకృష్ణకు అర్థం అయింది. వెంటనే దానిమూత బిగించేశాడు.

కోతి, మూటను తీసుకుని అతనికి మార్గం చూపిస్తున్నట్టుగా, పట్టాలను ఆనుకొని ఉన్న పొలం గట్లవైపు దారితీసింది.

రామకృష్ణకు ముందు అర్థం కాలేదు.

అది ఆగి వెనక్కు చూసింది.

రామకృష్ణ లేచి వాటర్‌బాటిల్ తీసుకొని

పట్టాలు దాటి చేతిలో పుస్తకాన్ని గుండ్రంగా చుట్టి పట్టుకుని చేలగట్టుమీద నడవడం మొదలెట్టాడు కోతిని అనుసరిస్తూ.

అతనికి చాలా ఉత్సుకతగా ఉంది.

అది ఇంకా ఇంకా ఏం చేస్తుందో చూడాలని!

పచ్చని పొలాల మధ్య నుంచి సాయంసంధ్యవేళ చల్లని స్వచ్ఛమైన గాలి ఊపిరి ఇంకా ఎంతో బాగా తీసుకోవా లనిపించేలా రివ్వున వీస్తుంటే నడుస్తున్న రామకృష్ణకి ఒక్కక్షణం బాల్యం గుర్తొచ్చింది.

హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ టి.వి.ఛానల్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న తాను సంక్రాంతి పండగకు తల్లిదండ్రుల ఇంటికి వచ్చాడు. హైదరాబద్‌లో ఏ పార్క్‌కు వెళ్తేనో తప్ప ఎక్కడా పచ్చదనం అనేదే కన్పించదు.

దూరంగా మేఘాల మధ్య నుంచి సూర్యుడు మైక్రోస్కోప్‌లో చూస్తున్న కమలా ఫలంసైజులో పశ్చిమానికి దిగుతున్నాడు.

గొప్పు తగలడంతో ఉలిక్కిపడ్డాడు రామకృష్ణ. గట్టుమీద ఒక్కక్షణం ఆగి చూశాడు.

కోతి ఎక్కడా కనిపించలేదు.

ఇదేమిటి? నిజంగా తనను పరిశీలించడానికి వచ్చిన భగవంతుడా! అనుకుంటూ ముందుకు నడుస్తూ మరో అయిదునిమిషాల తర్వాత తార్రోడ్డు మీదకు అడుగుపెట్టి అక్కడ దృశ్యం చూసి మ్రాన్పడిపోయాడు.

★★★

అక్కడ ఒక పెద్ద రావిచెట్టు కింద ఒక ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. ఆ విగ్రహం క్రింద కొంతమేర సిమెంట్ చేయబడి ఉంది. రోజూ కడిగి శుభ్రంచేసి ముగ్గు పెడుతున్నట్టుగా తామరాకు ముగ్గు వేసుంది.

ఆ సిమెంట్ చపటామీద ఒక ఏభైయ్యేళ్ళ ముసలమ్మ. నిండుగా మాసిన చిరుగుల దుప్పటి కప్పుకుని, మూసిన కన్నెరుగకుండా పడుంది. ఆ ముసలమ్మ ముఖం ముందు తను తెచ్చిన మూట కనబడేలా ఉంచి ఆమెను పొత్తిళ్ళలో బిడ్డలా కావలించుకుని కళ్ళు మూసుకొని పడుకుని ఉంది కోతి.

రామకృష్ణ వచ్చిన అలికిడికి తలెత్తి చూసిన దాని కళ్ళలోంచి కన్నీళ్ళు జారి, దాని రోమాలపైపడి గరికివేళ్ల మీద మంచు బిందువుల్లా మెరుస్తున్నాయి.

రామకృష్ణలో నిజమైన చైతన్యం అప్పుడు వచ్చింది.

ఇంతసేపూ అది చేసింది కోతిచేష్టలే అనుకున్నాడు తను. నోరులేని ఆ మూగజీవి ఇంతసేపూ తాపత్రయపడింది తన యజమానికోసం. తనను ఎన్నోసార్లు అందరికీ సలామ్ చెయ్యమని ఆజ్ఞాపించి, సలాం చెయ్యకపోతే, చింతబరికెతో యజమాని బాదినా, ఆ బాధను కక్షగా మలుచుకుని రాక్షసత్వంతో ప్రవర్తించే మానవనైజం ఆ మూగజీవికి లేకపోవడమే రామకృష్ణ మనసుని కలచివేసింది... అది తన యజమానిని కావలించుకుని పడుకున్న తీరుకి అతని మనసు ఆర్ద్రమై కళ్ళు చమర్చాయి. బాటిల్ ఓపెన్ చేసి ఆమె ముఖం చల్లని నీళ్లతో రెండుసార్లు కడిగాడు.

నిస్సహాయంగా పడిఉన్న ఆ పేదరాలి దీనస్థితి అతనిని తరువాత పనిచేయమని ఉపదేశించింది.

రామకృష్ణ రోడ్డుమీదకొచ్చి నిలబడ్డాడు. అటుగా మరో రెండునిమిషాల్లో

ఆటో వచ్చింది.

"ఊళ్లోకి వస్తారా బాబూ!" అడిగాడు ఆటోవాడు.

అప్పటికే ఆటోలో ఇద్దరున్నారు.

"అవునయ్యా! ఆ అవ్వ చలి జ్వరంతో వణికిపోతోంది పాపం! మా ఇంటికి తీసుకెళ్లాలి" అన్నాడు రామకృష్ణ

ఏమనుకున్నాడో ఏమో!

"పదండి బాబూ!" అంటూ ఆటోడ్రైవర్ అవ్వదగ్గరకి వచ్చాడు.

ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉన్న అవ్వని జాగ్రత్తగా లేపి ఆమెను నెమ్మదిగా నడిపించుకుంటూ ఆటోలో చేర్చాడు రామకృష్ణ ఆటోడ్రైవర్ సాయంతో.

తనకన్నా ముందుగా డ్రైవింగ్‌సీట్లో చేరిన కోతిని చూస్తూనే చిన్నగా నవ్వాడు ఆటోడ్రైవర్.

"చూశారా బాబూ! యజమాని అంటే దానికెంత విశ్వాసమో! మనుషులం మనమూ ఉన్నాం ఎందుకు? దానికున్న ప్రేమలో ఆవగింజలో అరవయ్యవ భాగం సాటి మానవుడికి చూపించలేం!" అన్నాడు.

అవ్వని వీధివాకిట్లో పడుకోబెట్టి తండ్రిని పిలిచాడు రామకృష్ణ

రామశర్మగారు వస్తూనే ఆమెను పరికించి చూశారు.

"కంగారు పడవలసిన పనేం లేదురా అబ్బాయి! మలేరియా ఎటాక్ అయినట్టుంది. వెళ్లి నా కిట్ పట్రా!" అన్నారాయన.

వేడినీళ్లు పెట్టించి అవ్వకి ఇంజక్షన్ చేశారు.

ఆమె ఆ మగతలో ఉండగానే టాబ్లెట్ వేయించి వేడివేడి టీ ఇప్పించారు. అంతసేపూ కోతి అలా చూస్తూనే ఉంది బేలగా.

అరగంటలో ఆమె జ్వర తీవ్రత తగ్గింది.

నెమ్మదిగా కళ్లు విప్పింది అవ్వ.

అవ్వ కళ్లు తెరవడం చూస్తూనే వీధివాకిట్లో ఉన్న స్తంబాల చుట్టూ సంతోషంతో కేరింతలు కొట్టే పాపాయిలా గెంతి గెంతి అలసిన కోతి నెమ్మదిగా ఆమె పక్కలోనే ఒదిగిపోయింది.

అవ్వ దాన్ని ప్రేమగా నిమిరింది.

"ఇదంతా నీ 'మారుతి' చేసిన పనే అవ్వా! రైల్వేస్టేషన్‌లో ఖాళీగా నేను పుస్తకం చదువుకుంటుంటే ఏవో కోతిచేష్టలనుకున్నాను. నీ కోసం ఎంత తాపత్రయపడిందని! ఆగి ఉన్న రైల్లో నీ కోసం అది కష్టపడి సంపాదించిన డబ్బు!" రామకృష్ణ జేబురుమాలు మూటని అవ్వకి అందించాడు.

"ఎలా ఉందమ్మా!" రామశర్మగారు అడిగారు.

"మీ దయవల్ల బానే ఉండాది బాబూ! అయితే బాగా నీరసంగా అనిపిస్తాంది!"

"మరేం పర్లేదు అవ్వ! నాలుగురోజులు మా ఇంట్లోనే ఉండు. జ్వరం తగ్గాక వెళ్లుదువుగాని! నీకు ఎవ్వరు లేరా?" అడిగాడు రామకృష్ణ

"ఎందుకు లేరు బాబూ! జమాజెట్టీల్లాంటి ముగ్గురు కొడుకులుండారు. ఆళ్లకి యమ్మ అక్కరనేదు. లోకంలో నాలాంటి తల్లులెందరో! ఎవరు లేకపోయినా నా మారుతే నా పాలిట దేవుడు బాబూ! అయినా మీకెందుకు బాబూ సెమ.

నేనెళ్లిపోతాను'' అంటూ లేవబోయి అంతలోనే కూలబడింది అవ్వ నీరసంతో.

"నే చెప్పానా! నువ్వు కదలడం మంచిపని కాదు. మా ఇంట్లో నీకేం లోటు రాదు. ఓరేయ్ రామా. అవ్వ ఎక్కడికీ వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకో! మళ్లీ జ్వరం రావచ్చు. వస్తే మళ్లీ ఈ టాబ్లెట్ వేసి వేడివేడిగా కాఫీ ఇవ్వండి. నేనలా వెళ్లి వస్తాను'' అని పురమాయించి ఆమెను మరోసారి హెచ్చరించి ఆయన బయటకు వెళ్లిపోయారు. రామకృష్ణ స్నానం చెయ్యడానికి ఉద్యుక్తుడయ్యాడు.

★★★

వీధి వాకిట్లోకి కనబడేలా హాల్లో టి.విని గుమ్మం వైపు తిప్పి తనూ వీధి అరుగుమీద చతికలపడి టి.వి. చూస్తున్నాడు రామకృష్ణ. అవ్వకూడా స్థంభానికి ఆనుకొని టి.వి. చూస్తోంది. మారుతి ఆమె ఒళ్లో కళ్లు తెరచి చూస్తూనే పడుకుని ఉంది.

"అంకుల్!" అంటూ సుడిగాలిలా రాబోయిన 'అనిల్'ని చూస్తూనే ఒక్క ఉదుటున లేచి గుర్రు పెట్టింది కోపంగా మారుతి. అవ్వ కోప్పడడంతో చేసేదిలేక అవ్వ వెనక దాక్కుంది కాని వదిల్తే 'అనిల్'ని పీకేసే దానిలా ఉందది.

"భయపడకు! అదేం చేయదులే. రా!" అంటూ అనిల్‌ను దగ్గరకు లాక్కుని తన చేతుల్ని వాడి చుట్టూ చట్రంలా బిగించాడు రామకృష్ణ.

అనిల్ పక్కింటి ఆంటీగారి అబ్బాయి. ఫారెక్స్ బాబులా అందంగా, బొద్దుగా ఉంటాడు. ప్రతీ ఫ్యాన్సీడ్రస్ షోలోనూ వాడిదే ఫస్ట్ ప్రైజ్.

''అది... అది ఇక్కడికెలా వచ్చిందంకుల్! సాయంత్రం మా ఫ్రెండ్స్ అంతా దాన్ని ఏడిపిస్తుంటే చూడలేక నేనే దాని గొలుసు విప్పేశా!" అన్నాడు భయంగా రామకృష్ణ కేసి చూస్తూ.

ఆమాట పూర్తవుతూనే రామకృష్ణ వాడిని విసురుగా ఒక్కతోపు తోయబోయి ఆగిపోయాడు.

ఒకవిధంగా అనిల్ చేసింది ఎంతో మంచిపని. వాడు గొలుసే విప్పి ఉండకపోతే అది రైల్వేస్టేషన్‌కు వచ్చి తనకు తటస్థపడేదే కాదు. అవ్వను రక్షించే అవకాశం వచ్చి ఉండేదే కాదు.

ఒక మంచిపని తాను చేయడం, ఎదుటి వాళ్లకు మరో మంచి పనిచేసే అవకాశం కలగనివ్వడం ఒక ఈ పల్లెటూళ్ల లోనే సాధ్యమేమో.

హైదరాబాద్ లాంటి చోటైతే ఒకరినొకరు పట్టించుకునే అవకాశమేలేదు. ఎంతో తెలిసినవారైతేనే తప్ప ఒకవిధంగా నగరవాసులంతా యాంత్రిక జీవనాన్ని గడిపే మూగజీవులే. అలాంటి వాతావరణంలో బ్రతుకుతున్న తనకు ఒక మంచిపనినిచేసే అవకాశం పరోక్షంగా కల్పించిన అనిల్‌ని తనవైపు తిప్పుకొని ముద్దులతో ముంచెత్తసాగాడు రామకృష్ణ.

అంకుల్ ప్రవర్తన అర్థంకాని ఆ ఏడేళ్ళ పసిమనసు అతని చేతుల్లో పూలమాలలా ఒదిగిపోయింది. ●

'ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక'
31-01-2000